ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 09 జూన్ 2026

## రాజంపేట అమ్మవారి శాలకు 125 ఏళ్లు

### ఈనెల 25 నుంచి 29 వరకు మహా కుంభాభిషేకం



రాజంపేట, జూన్8 ప్రభాతవార్త

భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా రాజంపేట వాసవి మాత ఆలయానికి 125 ఏళ్లు. 1902లో రాజంపేట అమ్మవారి శాల ఆలయం ప్రారంభమైంది.125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజంపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహా కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆలయాన్ని పూర్తిస్థాయిలో జీర్ణోద్ధరణ చేశారు. ఆలయానికి నూతనంగా వేశారు. ఐదు రోజుల పాటు కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహించనున్నారు. కుంభాభిషేక ఉత్సవాలను కంచి కామకోటి పీఠాధి పతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి,శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి అనుగ్రహంతో నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. వాసవి మాతకు సామ్రాజ్య పట్టాభిషేకం, శత చండీ పారాయణ పవిత్రోత్సవం, శతవర్ష ఉత్సవములు, శత రుద్రీయం కార్య క్రమాలను ఈ సందర్భంగా నిర్వహించనున్నారు. మహా కుంభాభిషేకం ఉత్సవాలలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని రాజంపేట ఆర్యవైశ్య సంఘం కోరింది.

## సర్‌పై నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలి

### ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కలికిరి, జూన్ 8, ప్రభాతవార్త:

పీలేరు నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు సర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే స్వగృహంలో పీలేరుకు చెందిన తెదేపా నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఓటరు లిస్టులో పేరు నమోదు తదితర అంశాలపై కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు. ఓటరు లిస్టు కొత్త వారి పేర్లు, చనిపోయిన వారి పేర్లు తొలగింపు తదితరఅంశాలపై గ్రామాల్లో క్షేత్రస్థాయిలో బీఎల్ఓలను సంప్రదిస్తూ ఓటరు లిస్టు తయారుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జరగబోయే ఎన్నికల్లో ఓటరు లిస్టుపైనే ఎన్నికలు జరుగుతాయన్నారు. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పీలేరు మండలం టీడీపీ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర జంగం సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వాసనూరి చంద్రశేఖర్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికారులు వేసిన హెచ్చరిక బోర్డులు మాయం



ప్రభుత్వస్థలంలో వేగంగా జరుగుతున్న కబ్జాలు

**అర్ధరాత్రి కబ్జాదారుల నిర్మాణాలు**
**అధికారులతో కుమ్మక్కైన కబ్జాదారులు**
**పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది**

బద్వేలు, జూన్ 8 (ప్రభాతవార్త) :

జిల్లాలో ఎక్కడా లేనివిదంగా గోపవరం మండలంలో కబ్జాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. కబ్జాదారులతో అధికారులు కుమ్మక్కైయారా అన్నట్లు కబ్జాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ స్తలాలలోకబ్జాలు జరుగుతుంటే అధికారులు బోర్డులు వేసినా వాటిని తొలగించి మాకు అడ్డు ఎవరూ లేరు మేం చెప్పిందే వేదం ఏ స్థలమైనా కబ్జా చేస్తాం, మాకు పట్టాలు ఉన్నాయని ధైర్యంతో అది ప్రభుత్వ స్థలం అని తెలిసినా కబ్జాలు చేస్తున్నారు. ఒక్కసారి రెవెన్యూ అదికారులు ఆలోచించి బోర్డు వేశారంటే దాని వెనుక అర్థం వేరు. మళ్లీ ఆ బోర్డు తొలగించడం ఆంతర్యమేమిటి? ఇది అధికారులు తొలగించారా లేక కబ్జాదారులా తీసివేశారా అనేది రెవెన్యూ అధికారులకే తెలియాలి. గోపవరం మండలం శ్రీనివాసపురం వద్ద సర్వేనెంబరు 1848,1852లో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ కబ్జాలు జరుగుతున్నాయి. ఈ భూమి ప్రభుత్వ భూమి అని ఎవరూ కబ్జా చేయరాదని హెచ్చరిక బోర్డు వేశారు. మరుసటి రోజు బోర్డు మాయమైంది. నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చినా పట్టించుకోలేదు. వారం రోజులు పనులు ఆపేసి రాత్రి సమయాలలో జోరుగా నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో కొంతమంది దళితులకు ప్రభుత్వం భూములు ఇచ్చినప్పటికీ వారు సాగు చేసుకోలేకపోవడంతో వాటిని ఇతరులకు కట్టబెట్టడంతో అవి ఇంటి పట్టాలుగా మార్చుకుని క్రయ విక్రయాలు జరుపుతున్నారు. అలాగే పక్కనే ప్రభుత్వ భూమి ఉండడంతో ఇదే అదునుగా భావించి కొంతమంది వ్యక్తులు స్థలంలో నిర్మాణాలు వేగంగా చేపడుతున్నారు. రెవెన్యూ రికార్డులో మా పట్టాలు ఉన్నాయని చెప్పుకుంటూ వేగంగా కబ్జాలు చేస్తున్నారు. గతంలో ఉన్న తహశీల్దారు పట్టాలు ఇచ్చారని చెప్పుకొస్తున్నారే గాని, బద్వేలు, గోపవరం రెవన్యూ కార్యాలయాలలో అసలైన రికార్డు కార్యాలయంలో లేదని, కోర్టుకు హాజరు పరిచినట్లు కొంతమంది చెబుతున్నారు. ప్రస్తుతమున్న రికార్డులో పేర్లను చూసి దొంగపట్టాలు సృష్టించి అవే ఒరిజినల్ పట్టాలుగా చెప్పుకుంటూ యదేచ్ఛగా కబ్జాలు చేస్తున్నట్లు సమాచారం. ఎవరైనా పేదవాడు ఒక సెంటు స్థలం ప్రభుత్వభూమిలోకి వెళితే అతనిపై లేనిపోని కేసులుపెట్టి ఇబ్బందులు పెట్టే వీఆర్‌వోలకు ఇంత కబ్జాలు జరుగుతుంటే కనపడడం లేదా? క్రిందిస్థాయిలో మండల పరిధిలో ఎక్కడ ఏమి జరిగినా వీఆర్వోలకు తెలుస్తుంది. కానీ గోపవరం మండలంలో జరుగుతున్న కబ్జాలలో కొంతమంది రెవెన్యూ సిబ్బంది పాత్ర ఉన్నట్లు సమాచారం. ఎందుకంటే కబ్జాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం, వారికి నోటీసులు జారీ చేయకపోవడం, వారిపై కేసులు పెట్టకపోవడం లాంటివెన్నో ఉదాహరణలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. గోపవరం మండలంలో ఉన్న ప్రభుత్వ స్థలాలలో జరుగుతున్న కబ్జాలు రాష్ట్రంలో ఎక్కడా జరగవేమో అన్నట్లు గా కనపడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కబ్జాలపై దృష్టిపెట్టకపోతే మాత్రం ప్రభుత్వ స్థలాలన్ని కబ్జాదారుల కబంధహస్తాలలోకి వెళ్లే ప్రమాదముంది.




రెండు రోజుల క్రితం వేసిన హెచ్చరిక బోర్డు మాయం

## వరదయ్య గారి పల్లెలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

### జగన్మోహన్ రాజు చంద్రబాబు హయాంలోనే గ్రామాలలో రహదారులకు మహర్దశ



రాజంపేట, జూన్ 8 ప్రభాతవార్త :

గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన సిమెంటు ఎక్కువ శాతం చంద్రబాబు హయాంలో నిర్మించినవేనని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే వేల కోట్ల రూపాయల నిధులు గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి వ్యయం చేసిందని పేర్కొన్నారు. మండలంలోని వరదయ్య గారి పల్లెలు పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీ.సీ రోడ్ల నిర్మాణానికి ఆయన పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు మోలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని చమర్తి ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట మార్కెట్ కమిటీ ఛైర్మన్ గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు, మండల క్లస్టర్ ఇంచార్జ్ దగ్గుబాటి వెంకటేశ్వర్లు నాయుడు,కో క్లస్టర్ ఇంచార్జ్ సతీష్ నాయుడు,మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ టెక్కేమ్ మల్లికార్జున నాయుడు,సీనియర్ నాయకులు పత్తిపాటి రవి,మేకా నరసింహులు,బ్రాహ్మణ పల్లె సాంబశివ నాయుడు,కేసి నాయుడు,యోగి, శరత్ మారుతూ, ఎంపీటీసీ,సింగన వెంకటయ్య, కె.సుబ్బరాయుడు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బెలూన్లతో..

# వైఎస్సార్‌సీపీ ఆందోళన

### ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా చంద్రబాబు విధానాలపై విమర్శలు




నల్ల బెలూన్ లు వదిలి నిరసన వ్యక్తం చేస్తున్న వైకాపా నేతలు కార్యకర్తలు

పులివెందుల, జూన్ 8, ప్రభాత వార్త :

పులివెందుల పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్సార్ ఆడిటోరియంలో సోమవారం “చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు“ కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు అనుసరించిన విధానాలు, ఇచ్చిన హామీల అమలుపై నిరసన వ్యక్తం చేస్తూ నల్ల బెలూన్లతో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఆడిటోరియం ప్రాంగణంలో ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి, రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా చంద్రబాబు పాలనలో జరిగినట్లు ఆరోపిస్తున్న మోసాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు పరిస్థితులను చిత్రాల రూపంలో ప్రదర్శించారు. నాయకులు మాట్లాడుతూ ప్రజలను మోసం చేసిన విధానాలను ప్రజలకు వివరించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ మధు రెడ్డి, చవ్వా దుశ్యంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. పార్టీ శ్రేణులు, అన్ని మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ..మిగతా 2వ పేజీలో

### వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఇంజనీరింగ్ పనులపై

# ప్రత్యేక దృష్టి పెట్టాలి

### జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



మదనపల్లి, జూన్ 8 ప్రభాతవార్త

జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధితో పాటు ఇంజనీరింగ్ శాఖల పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రాథమిక రంగాలు, ఇంజనీరింగ్ శాఖల సమీక్ష సమావేశంలో కలెక్టర్ సంబంధిత అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, రైతుల సంక్షేమం, మోలిక సదుపాయాల మెరుగుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న డిజిటల్ సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతు యాప్‌లో నమోదులు పెంచడంతో పాటు రైతులు ఆ యాప్‌ను సక్రమంగా వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హార్టికల్చర్ శాఖ అధికారులు మైక్రో ఇరిగేషన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో పండుతున్న తోతాపురి మామిడి పంటకు రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని, టమోటా రైతులు మధ్యవర్తుల వల్ల నష్టపోకుండా చూడాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా పాల ఉత్పత్తి పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ శాఖల సమీక్షలో భాగంగా జిల్లాలో రహదారులపై గుంతల సమస్య లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో బీకేపల్లిలో నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించిన సవరించిన అంచనాలను త్వరితగతిన ఆమోదానికి పంపించి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి వెంకట పెద్దయ్య, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

### జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్



యోగాలో పాల్గొన్న కలెక్టర్, జేసి, సబ్‌కలెక్టర్లు

మదనపల్లె, జూన్ 8 ప్రభాతవార్త :

యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ 12వ యోగా దినోత్సవం 2026 సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమంలో భాంగా సోమవారం ఉదయం జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణిలు పాల్గొన్నారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం దిశగా జిల్లా ముందుడగు వేస్తోందన్నారు. యోగా పట్ల ప్రజల్లో పెరుగుతున్న చైతన్యం సంతోషకరమన్నారు. యోగాను ప్రజల జీవనశైలిలో భాగం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. యోగా ద్వారా శారీరక దృడత్వంతో పాటు మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. రెండు వారాలు పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ యోగా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెలుతున్నట్లు వివరించారు. ఈనెల 11న హార్సిలీహిల్స్, 14న బోయకొండలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాను ప్రతిరోజూ ఆచరించే విధంగా అలవాటు చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అంగన్‌వాడి సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు యోగా సందేశాన్ని ప్రతి ఇంటికి చేర్చాలన్నారు. విద్యార్థులు చిన్నవయసు నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించేలా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో యోగా శిక్షకుడు పాల్ బ్రహ్మకుమార్, డిఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమీళ, పీడీలు హైమావతి, వెంకటరత్నం, డిపిఓ రాధమ్మ, ఆర్డీఓ నాగేశ్వర్‌రావు, డిఎల్‌డిఓ లక్ష్మీపతి, డిఎంఅండ్‌హెచ్‌ఓ లక్ష్మీ నరసయ్య, తహశీల్దార్ మాధవి, వివిధశాఖల అదికారులు పాల్గొన్నారు.

## ఆట వస్తువే పసికందు

# ప్రాణం తీసింది

### తల్లిదండ్రులకు మిగిలిన కడుపుకోత



చౌడేపల్లి, జూన్ 8 ప్రభాతవార్త

ఆ ఇంట 5నెలల క్రితం ఒక చిరునవ్వు పూసింది...ఆ పసివాడి కేరింతలతో ఇల్లంతా సంతోషంతో నిండిపోయింది ముందు వెనుకకు బోర్లా పడుతూ కనిపించినదెల్లా నోట్లో పెట్టుకొనే అమాయకపు వయస్సది...ఆట వస్తువే ఆ పసి ప్రాణాన్ని బలితీసుకొంటుందని ఊహించలేకపోయారు. ఆడుకొంటూ ప్రమాదవశాత్తూ ఒక చిన్న గోలీని మింగడంతో 6నెలల పసికందు ఊపిరాడక ప్రాణాలు విడచిన ఘటన కోటూరులో తీవ్ర శోకాన్ని నింపింది...ఒక చిన్న నిర్లక్ష్యం ఒక ఇంటి దీపం ఆరిపోయింది. మండలంలోని పెద్దకొండామర్రి పంచాయతీ కోటూరుకు చెందిన మోహన్, నాగలక్ష్మి దంపతులకు 6నెలల కార్తీక్ వున్నాడు. వారిద్దరూ ఉద్యోగ రిత్యా బయటకు వెళ్ళండంతో చిన్నారి ఆలనా పాలనా కుటుంబ సభ్యులు చూసుకొనేవారు. ఈక్రమంలో సోమవారం యదావిధిగా తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగం కోసం వెళ్ళారు. ఇంట్లో చిన్నారిని ఆట్లాడుకొనేందుకు నేలపై విడచిపెట్టిన కుటుంబ సభ్యులు ఇంటి పనిచేసుకొంటూ వున్నారు. లోకజ్ఞానం తెలియని పసివాడు ఆడుకొనే క్రమంలో ఒక గోలీ చేతికి చిక్కింది. దాన్ని నోట్లో వేసుకోగా అదికాస్తా గొంతులో శ్వాసనాళంలో అడ్డు పడటంతో పిల్లాడు ఒక్కసారిగా కేకలు వేయడం ఆపేశాడనీ, వెంటనే గుర్తించిన తాను ఆసుపత్రికి పరుగులు తీశానని చిన్నారి బంధువు తెలిపింది. అయితే అప్పటికే కార్తీక్ మృతి చెందినట్లు వైద్యులు దృవీకరించారు. నెలలకు కూడా నిండని పసికందు మృతి చెందడంతో తల్లిదండ్రలతో పాటు గ్రామం మొత్తం ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకొన్నాయి. అప్పటి దాకా అందరినీ నవ్విస్తూ వున్న పసికందు విగత జీవిగా ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ దృశ్యాన్ని చూసిన వారికి సైతం కంటతడి పెట్టుకొన్నారు.

### రూ.10కోట్ల ప్రభుత్వ భూమికి

# రక్షణ కరువు

- కబ్జారాయుళ్లకు దారులు చూపుతున్న అధికారులు
- ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు తొలగింపు
- నిద్రమత్తులో రెవెన్యూ సిబ్బంది, అధికారులు
- రోడ్డుకు ఆనుకుని ఉన్న కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిపై కన్ను



బద్వేలు, జూన్ 8 (ప్రభాతవార్త):

పట్టణంలోని పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో ఉన్న 70 సెంట్ల ప్రభుత్వ భూమిపై కబ్జాదారులు కన్నేసి ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తుంటే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. బద్వేలు పంచా యతీ సర్వేనెంబరు 1156లో 70 సెంట్లు చెరువు పోరంబోకు స్థలం మెయిన్ రోడ్డుకు కనపడుతుంది. దీని వెనకనే రిజిష్టర్ విలువ గల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ ముందు భాగంలో ఉన్న ఈ చెరువు స్థలాన్ని ఆక్రమించడం వలన రిజిష్టర్ భూమికి అనువుగా ఉంటుందని అలాగే వెళ్లేందుకు రోడ్డు మార్గం కూడా ఉంటుందనే ఉద్దేశ్యంతో గత కొన్ని రోజుల క్రితం దీనిపై కన్నేసి భూమిని చదును చేసి రిజిష్టర్ స్థలంలోకి వెళ్లేందుకు రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. ఈ 70 సెంట్ల ప్రభుత్వ భూమి రోడ్డుకు ఆనుకుని ఉండడం వలన అక్కడ సెంటు విలువ రూ.20లక్షలకు పైగా పలుకుతోంది. దీనిని బట్టి చూ స్తే ఆ ప్రభుత్వ స్థలం విలువ దాదాపు రూ.14కోట్లు ఉంటుందని అం చనా వేస్తున్నారు. ఈ స్థలం ఇరిగేషన్కు సంబంధించినది అయినప్పటికీ ఆ శాఖాధికారులు పూర్తిగా చేతులెత్తేయడంతో రెవెన్యూ అధికారులు గతంలో ఈ స్థలాన్ని కాపాడేందుకు హెచ్చరిక బోర్డు వేశారు. కొద్ది రోజుల తర్వాత ఆ హెచ్చరిక బోర్డు కనపడకుండా పోయింది. ప్రసు_తం ఆ స్థలానికి రక్షణ కరువైంది. ప్రభుత్వ స్థలాలను, చెరువులను, కుంటలను కాపాడాల్సిన అధికారులు రోడ్డుకు ఆనుకుని ఉన్న విలువైన స్థలాన్ని కాపాడుకోవడంలో విఫలమవుతున్నారని పలువురు అం టున్నారు. పట్టణ నడిబొడ్డులో ఇంతటి విలువైన ప్రభుత్వ స్థలం ప్ర జా అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిసి కూడా ఆ స్థలానికి ఎలాంటి రక్షణ కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన అధికారులు నాగులచెరువుకు సంబంధించిన ఒక సెంటు స్థలాన్ని కూడా కాపాడుకోలేని స్థితిలో ఉన్నారు. ఈరోజు చెరువుచుట్టూ ఉన్న స్థలాలు కబ్జాకా వడమే కాకుండా రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇంత విలువైన స్థలాన్ని కూడా పట్టించుకోవడం లేదు. పట్టణ నడిబొడ్డున 70 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉండడం ఎంతో గొప్ప విషయం అలాంటి స్థలాలను కాపాడు కోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కబ్జాదారులకు దారి చూపినట్లు కాదా, వాటి రక్షణకు మార్గాలు చూడాలి తప్ప అలా వదిలేయడం వలన రాబోయే రోజులలో వెనుక బాగంలో ఉన్న రిజిష్టరుకు సంబంధించిన యజమానులు మాదేనని పోట్లాడినా, అనుకోని పరిణామాల దృష్ట్యా రిజిష్టర్ లోకి కలుపుకున్నా కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

## పుస్తక పఠనంద్వారా అపార పరిజ్ఞానం పొందవచ్చు



సర్టిఫికెట్లను చూపుతున్న విద్యార్థులు

**వాల్మీకిపురం, జూన్ 8 ప్రభాతవార్త :**

విద్యార్థులు చిన్నవయస్సు నుంచినే గ్రంథాలయాల ద్వారా లభ్యమయ్యే కొత్తకొత్త పుస్తకాలను చదవడం ద్వారా ప్రపంచంలో జరిగే కొత్త కొత్త విశేషాలతోపాటు అపార పరిజ్ఞానం పొందవచ్చునని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు సభ్యులు రాసాని వెంకట రామయ్య అన్నారు. వాల్మీకిపురం గ్రంథాలయం పరిధిలో ఈ వేసవిసెలవుల్లో నిర్వ హించిన వివిధ అంశాల శిక్షణను పూర్తిచేసుకున్న విద్యార్థులకు వేసవి శిక్షణాశిబిరం ముగింపు సందర్భంగా సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరామయ్య వివిధ పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు తిరుపతికి చెందిన విశ్రాంత మెడికల్ ఆఫీసర్ ఉమాదేవితో కలిసి ఆయన శిక్షణపూర్తిచేసుకున్న విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లును పంపి ణీచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నవయస్సు నుంచినే పోటీ తత్వం అలవర్చుకోవాలని, విరామసయమాల్లో కొత్త కొత్త పుస్తకాలను చదవడం, ప్రపంచంలో జరిగే ఎన్నో కొత్త విషయాలతో పాటు అద్భుతాలను తెలుసుకోవడం ద్వారా పోటీపరీక్షల్లో సులభంగా రాణించవచ్చునని సూచించారు. తదుపరి గ్రంథాలయంలో ఉన్న రికార్డులు, సౌకర్యాలను వెంకటరామయ్య తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రమాపతి, సివిల్ సప్లైయ్ ఆఫీసర్ భాస్కర్, ఉపాధ్యాయుడు వాసుదేవాచారి, భాస్కర్, గ్రాంథాలయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ముగిసిన సమ్మర్ ఫుట్ బాల్ కోచింగ్ క్యాంప్



**మదనపల్లె క్రైం, జూన్ 8 ప్రభాతవార్త.**

మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నెల రోజుల పాటు ఉత్సాహంగా సాగిన వేసవి ఫుట్ బాల్ శిక్షణ శిబిరం (సమ్మర్ కోచింగ్ క్యాంప్) ఘనంగా ముగిసింది. జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు నిర్వహించిన ఈ శిబిరం ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను, ట్రోఫీలను బహూకరించి అభినందించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. నిరంతర సాధనతోనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఈ వేసవి శిబిరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందన్నారు. క్రీడాకారులు ఈ శిక్షణను ఉపయోగించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ ముగింపు వేడుకల్లో రామసముద్రం మండల విద్యాశాఖాధికారి ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ అన్సర్ భాష, ఫుట్బాల్ అసోసియేషన్ ప్రతినిధులు మురళి, నరేష్, మహేంద్ర, బాలాజీ, సీనియర్ క్రీడాకారుడు మోహన, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు

**చౌడేపల్లి, జూన్ 8, ప్రభాతవార్త:**



చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండామర్రి సమీపంలో గల విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులచే అభిషేక ప్రియుడు పరమశివుడికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. అదే విధంగా విశాలాక్షి, వినాయక, సుబ్రమణ్యం స్వామిలకు ప్రత్యేక పూజలు చేసారు. చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ నిర్మాణ కర్త మనోహర్ ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు.

## విత్తన శెనక్కాయలు బస్తా రూ. 1836లు

**చౌడేపల్లి, జూన్ 8 ప్రభాతవార్త**

విత్తన శెనక్కాయలు 30కిలోల సబ్సీడీ పోను బస్తా రూ. 1836లుగా ప్రభుత్వం నిర్ణయించిందని మండల వ్యవసాయాధికారి మోహన్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలానికి 1100 క్వింటాళ్ళ విత్తన శెనక్కాయలు మంజూరు అయ్యాయన్నారు. ఈనెల 9నుంచి ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింకైన మొబైల్ నంబరు తీసుకు రావాలన్నారు. నమోదు సమయంలోనే రూ. 1836లు చెల్లించిన వారికి మాత్రమే విత్తన శెనక్కాయలిస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగత రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## యమునా పుష్కరాలకు ఉచిత అన్నదానం

### సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు మునిగోపాలక్రిష్ణ

**మదనపల్లె, జూన్ 8 ప్రభాతవార్త :**

ఉత్తర ప్రదేశ్‌లోని మధురలో జరుగుతున్న యమునా పుష్కరాలకు భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మునిగోపాలక్రిష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ద్వారక తిరుమలలో ఉన్నటువంటి శ్రీ వెంకటేశ్వర నిత్యన్నదాన ట్రస్టు ఛైర్మెన్, సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13వరకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని 29రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం గత 8రోజులుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాది మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీమణి ధనలక్ష్మి, వైస్ ఛైర్మెన్ పురుషోత్వం, ట్రెజరర్ శాస్త్రి, సుబ్బలక్ష్మి, సభ్యులు రమేష్, లలిత, సూర్యనారాయణ మూర్తిలు పాల్గొన్నారు. యమునా పుష్కరాలకు విచ్చేసిన భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహింపడం పట్ల పలువురు వారిని అభినందించారు. దేశంలోని వివిధ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

# పక్కా భవనాలకు నోచుకోని గురుకుల పాఠశాలలు

### ఈ విద్యా సంవత్సరంలో కూడా సమస్యల పాతాలే, అవస్థల్లో విద్యార్థులు



మినిమం రెడ్డి గారి పల్లె వద్ద నిర్మాణంలో ఉన్న గురుకుల పాఠశాల,



అద్దె భవనంలో నడుస్తున్న కె.వి పల్లి గురుకుల పాఠశాల

**పీలేరు జూన్ 8 ప్రభాతవార్త:**

నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో విద్యాభివృద్ధికి తీవ్రంగా కృషి చేశారు. ఈ మేరకు నియోజకవర్గంలో మండలానికి ఒక బాలికల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి 2012 సంవత్సరంలో వీటిని ప్రారంభించారు. అప్పట్లో అన్ని పాఠశాలలు అద్దె భవనాల్లో ప్రారంభించారు. అప్పటినుంచి విద్యార్థులు చాలీచాలని వసతులు మధ్య నెట్టుకొని వస్తున్నారు. ప్రతి పాఠశాలలో 400 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా 250 నుంచి 300 మంది వరకు మాత్రమే చదువులు కొనసాగిస్తున్నారు. కొంతమంది పాఠశాలలో చేరి వసతులు లేకపోవడంతో టీసీలు తీసుకుని వెళ్ళిపోతున్నారు.

**నియోజకవర్గంలో పరిస్థితి ఇలా**

నియోజకవర్గ వ్యాప్తంగా పీలేరు, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం, కంభంవారిపల్లె మండలాలకు బాలికల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారు. వీటిలో వాల్మీకిపురం మండలంలో పక్కా భవనం పూర్తయింది. పీలేరులో మంజూరైన జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను ఎం జె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఒక అద్దె అపార్ట్మెంట్లో నిర్వహిస్తున్నారు. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలను నూనె గింజల కర్మాగారంలో పాడుబడ్డ భవనంలో ఆల్టరేషన్ చేసి తరగతులు వసతి అన్నీ కలిపి ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. కంభంవారిపల్లి మండలానికి మంజూరైన ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలను పీలేరులోని కోటపల్లి సమీపంలో వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గుర్రంకొండ మండలం మంజూరైన బాలికల గురుకుల పాఠశాలను చాలీచాలని వసతుల మధ్య అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. కలికిరి మండలానికి మంజూరైన గురుకుల పాఠశాలను పడ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు.

**పక్కా భవనాలు ఏర్పాటుకు కృషి.**



నియోజకవర్గ వ్యాప్తంగా అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాల లకు పక్కా భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం. ఈ మేరకు స్థలాలు పరి శీలన కూడా అయిపోయింది. కంభంవా రిపల్లి మండలం ఎస్టి గురుకుల పాఠ శాలకు భవనం సిద్ధం అవుతోంది మిగతా మండలాల పాఠశాలలో కూడా పక్క భవ నాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

..నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే, పీలేరు.

## యోగా విన్యాసాలు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**మదనపల్లె, జూన్ 8 ప్రభాతవార్త :**



పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో సోమవారం జరిగిన ఇంటర్‌నేషనల్ యోగా దినోత్సవంలో బాగంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా విన్యాసాలతో చిన్నారులు పలువురిని అలరింపచేశారు. పట్టణ సమీపంలోని దేవతానగర్‌లో ఉన్న చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ చిన్నారులు యోగా విన్యాసాల కార్యక్రమానికి హాజరై సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాసంస్థ జనరల్ సెక్రటరీ కవితారాణి ఆధ్వర్యంలో చిన్నారులు యోగా విన్యాసాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ ప్రమీలలు పిల్లలను అభినందించారు. చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం అందరిని అలరింపచేశాయి.

## సమాచార కమిషనర్‌ను కలిసిన నాయకులు

**మదనపల్లె, జూన్ 8 ప్రభాతవార్త :**



రాష్ట్ర సమాచార హక్కు చట్ట కమిషనర్ వి.రవిబాబును సోమవారం రాష్ట్ర ఉర్దూ అకాడమి వైస్‌ఛైర్మెన్ పఠాన్‌ఖాదర్‌ఖాన్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ పచ్చిపాల రామక్రిష్ణలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు ఆయనను శాలువతో సత్కరించి పుష్పగుచ్చంతో సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ పాలనలో నియోజవర్గానికి చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలపై రాజకీయ కక్షసాధింపుతో నమోదైన అక్రమ కేసుల అంశాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. వాటి ఉపసంహరణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెలుతానని హామీ ఇచ్చారు. కార్యకర్తల హక్కుల పరిరక్షణ, విలువల సంరక్షణే పార్టీ లక్ష్యం అన్నారు.

## పెద్దేరు ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి సహకరిస్తాం

### ఇరిగేషన్ ఎస్.ఈ. వెంకట్రామయ్య



**తంబళ్లపల్లె జూన్ 9 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె నియోజకవర్గానికి సాగునీటిలో ఆయువుపట్టుగా నిలిచిన పెద్దేరు ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇరిగేషన్ శాఖ ఎస్ ఈ వెంకట్రామయ్య ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ కొటాల శివకుమార్ కు హామీ ఇచ్చారు. సోమవారం మదనపల్లి ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో ప్రాజెక్టు చైర్మన్ శివకుమార్ ఎస్.ఈ.ని సన్మానించి స్వాగతించారు. పెద్దేరు ప్రాజెక్టు కు సాధారణ నిధులలో ఒక్క రూపాయి విడుదల కాలేదని ప్రాజెక్టులో కాలువల మరమ్మత్తులు పనులు, ప్రధాన రోడ్డు, పార్కు మరమ్మతులు, గెస్ట్ హౌస్ లు దీనస్థితి, పిల్ల కాలవలు మరమ్మతులు, పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నామని 4,500 ఎకరాల సాగుభూమి నిర్వీర్యం అయిపోతుందని నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎస్ ఈ వెంకట్రామయ్య పెద్దేరు సమస్యలను సుదీర్ఘంగా అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందించి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ సురేష్ బాబు, ఏఈలు రాయల్ బాబు, సతీష్, పెద్దేరు ఆయ కట్టు కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ ఆందోళన

మొదటి పేజీ తరువాయి



కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమం మొత్తం పార్టీ నినాదాలు, నిరసన కార్యక్రమాలతో సాగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నాగేల్ల సాంబశివరెడ్డి, అంబకపల్లి బాబు రెడ్డి,వల్లెపు వరప్రసాద్, గోటూరు చిన్నప్ప, హఫీజ్ , పార్నపల్లి కిషోర్, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు జడ్పిటిసిలు, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం కూటమి పాలనతోనే అభివృద్ధి వైపు పరుగులు

### జనసేన ఇంచార్జ్ పోతుల సాయినాథ్



**తంబళ్లపల్లె జూన్ 9 ప్రభాతవార్త ః**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూటమి పాలనలో ప్రజలు అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నట్లు తంబళ్లపల్లె జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ కొనియాడారు. సోమవారం ఆయనకు గుండ్లపల్లి పెద్దచెరువు చైర్మన్ సిద్ధమల్ రెడ్డి, టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధి పనులకు సాయినాథ్ పూజలు నిర్వహించి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం లో గత వైకాపా ప్రభుత్వం అన్ని రకాలుగా దోపిడీ చేయగా నేటి మాకూటమి ప్రభుత్వం 2047 విజన్ లో భాగంగా సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, చెరువుల అభివృద్ధి పనులతో బాటు సంక్షేమ పథకాలు అందించిన ఘనత మా కూటమికే దక్కినట్లు చెప్పారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ కు 15 ఏళ్ల వరకు తిరుగు లేదని వైకాపా అడ్రస్ గల్లంతు ఖాయమని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కూటమి అభ్యర్థులు విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. ఆయన వెంట క్లస్టర్ ఇంచార్జ్ కాలా నారాయణ, జైపాల్ నాయుడు, శివారెడ్డి, పెద్ద వీరభద్ర, మధు నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డప్ప నాయుడు, కూటమి నాయకులు, గుండ్లపల్లి ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

## పులివెందుల సీఐపై ఎస్పీకి ఫిర్యాదు

### దాడి చేసి చేయి విరగగొట్టారని గోవర్ధన్ రెడ్డి ఆరోపణ
### హైకోర్టులో కేసు వేస్తానని వెల్లడి

**పులివెందుల, జూన్ 8, ప్రభాతవార్త :**



సిఐ చేతిలో గాయపడ్డ గోవర్ధన్ రెడ్డి

పులివెందుల టౌన్ సీఐ శ్రీరాంపై జై హిందుస్థాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి జిల్లా ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. ఓ సివిల్ కేసు విషయంలో తాను స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్‌కు హాజరైనప్పటికీ, సీఐ తనపై విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా తనకు అయిన గాయాలను ఎస్పీకి చూపించిన గోవర్ధన్ రెడ్డి, ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి సీఐ శ్రీరాంను సస్పెండ్ చేయాలని కోరారు. తనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లా ఎస్పీ సమర్థవంతంగా స్పందించడంతోనే తాను సురక్షితంగా బయటకు వచ్చానని, లేకపోతే తన ప్రాణాలకు ముప్పు ఏర్పడేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, సీఐ శ్రీరాం వ్యవహారంపై హైకోర్టులో కేసు దాఖలు చేయనున్నట్లు గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. సీఐ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ అక్రమాలు, అన్యాయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొందరి పేర్లను అడ్డుపెట్టుకొని తనకు పరిచయాలు ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ అంశంపై చట్టపరంగా చివరివరకు పోరాటం కొనసాగిస్తానని గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు అందుకున్న జిల్లెల్ల రాజశేఖర్

**లక్కిరెడ్డిపల్లి: జూన్ 08 ప్రభాత వార్త**



మారకద్రవ్య రహిత సమాజం కోసం ఉమ్మడి కడప జిల్లాలో ఏప్రిల్ 22వ తేదీ నిర్వహించిన వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థ వ్యవ స్థాపకులు విజయ కలం ఆధ్వర్యంలో దండి మార్చ్ స్ఫూర్తితో దండి మార్చ్ 2.0 కార్యక్రమంలో భాగంగా 100 మీటర్ల జాతీయ జెండాతో వేల మంది విద్యార్థులను పోగుచేసి ర్యాలీ నిర్వహించిన జాగృతి లక్కిరెడ్డిపల్లికి చెందిన జిల్లెల్ల రాజశేఖర్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డు అవార్డు విజయవాడలో తెలియసం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు టిడి జనార్దన్ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. ఈ అవార్డు అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు, మంత్రి టీ డి జనార్దన్ రెడ్డికి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీనివాస రాజును తక్షణమే బర్తరఫ్ చేయాలి

### వైఎస్ఆర్‌ఎస్‌యు రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్ ఆగ్రహం

**పీలేరు, జూన్ 8 ప్రభాతవార్త:**



అన్నమయ్య జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్రీనివాస రాజు అవి నీతి సామ్రాజ్యాన్ని సృష్టించి జిల్లాలోని విద్యా వ్యవస్థను సర్వనాశనం చేశారని వైఎస్ఆర్ ఎస్‌యు రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం పీలేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీనివాస రాజు సాగిస్తున్న చట్టవిరుద్ధ పర్వాన్ని, రాజకీయ బరితెగింపును తీవ్ర పదజాలంతో ఎండగట్టారు. నిబంధనల ప్రకారం ఎప్పుడో ముగిసిపోయిన ఆయన పదవీ కాలపరిమితిని, తెరవెనుక లాబీయింగ్ చేసుకుంటూ డెప్యుటేషన్ పేరుతో ఇంకా అక్రమంగా ఎలా పొడిగించుకుంటున్నారని ఉన్నతాధికారులను నిలదీశారు. ప్రభుత్వ జీతం తింటూ బాధ్యతాయుతమైన సీట్లో కూర్చున్న శ్రీనివాస రాజు, నిన్న కడప హరిత హోటల్‌లో జరిగిన ఒక పక్కా రాజకీయ అజెండా సమావేశంలో ప్రత్యక్షమవ్వడం ఆయన సర్వీస్ నిబంధనలు ఉల్లంఘనకు పరాకాష్ట అని చక్రధర్ పేర్కొన్నారు. ఒక అధికార హోదాలో ఉంటూ రాజకీయాల్లో వేలు పెట్టడమే కాకుండా, మా పార్టీ అధ్యక్షుడి పైన, వైఎస్సార్‌సీపీ నాయకత్వం పైన తన స్థాయి మరిచి, మతిభ్రమించి మాట్లాడటం దుర్మార్గమన్నారు. శ్రీనివాస రాజు తన అహంకార పూరిత వ్యాఖ్యలపై తక్షణమే వైఎస్సార్‌సీపీ శ్రేణులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిప క్షంలో జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి భువనేశ్వర్ రెడ్డి, విద్యార్థి విభాగం ముఖ్య నాయకులు నరేష్, లోకనాథం మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం కార్యకర్తలు, విద్యార్థి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సింహవాహనంపై దర్శనమిచ్చిన బోయకొండ గంగమ్మ

**వాల్మీకిపురం, జూన్ 8 ప్రభాతవార్త :**



పట్టణంలోని తోటవీధిలో వెలసిన బోయకొండ గంగమ్మ జాతర మహోత్సవంలో రెండువ రోజు సోమవారం ఉదయం పుష్పపల్లకిలోని సింహవాహనంపై అధిరోహించిన అమ్మవారు గ్రామంలోని మాడవీధులతో పాటు తోటవీధిలో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మంగళవాయిద్యాలు, బళ్లారిడ్రమ్స్, బాణాసంచా పేళ్లుళ్ల మధ్య అమ్మవారు ఊరేగారు. భక్తులు కొబ్బరికాయ, కర్పూరంలను సమర్పించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, జానపదనృత్యాలు, కోళాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తోటవీధి యువత, ప్రజలు పాల్గొన్నారు.

## భూమిని ప్రేమిద్ధాం-వ్యవసాయాన్ని బ్రతికిద్దాం

**చౌడేపల్లి, జూన్ 8 ప్రభాతవార్త**



సదస్సునుద్దేశించి ప్రసంగిస్తున్న డాక్టర్ మంజుల

భూమిని ప్రేమించి వ్యవసాయాన్ని బ్రతికిద్దామని కలికిరి వ్యవసాయక్షేత్రం సమన్వయకర్త డాక్టర్ మంజుల అన్నారు. సోమవారం మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండామర్రిలో కలికిరి కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సూచనల మేరకు కేత్‌బచావో అభియాన్(పొలాల సంరక్షణ)పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలాల రక్షణలో భాగంగా రైతులు పచ్చిరొట్ట, జీవన ఎరువులు, జీవశిలీంద్ర నాసినులను వినియోగించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల భూసారం పెరిగి అధిక పంటల దిగుబడి వుంటుందన్నారు. భూసార పరీక్షల వల్ల ఎరువుల వాడకం, వానపాములు, పశువుల ఎరువులు ఏ విధంగా వాడాలన్న అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పుంగనూరు వ్యవసాయ సంచాలకుడు శివకుమార్, మండల వ్యవసాయాధికారి మోహన్‌కుమార్, జిల్లావనరులు కేంద్రం అధికారి రామకృష్ణమరాజు, కెవికే శాస్త్రవేత్త సోమశేఖర్‌బాబు, ఆత్మ అధికారి అమృత్‌కుమార్‌రెడ్డి, వివిఎ జయంతి, అభ్యుదయ రైతు పూల చంద్రమౌళి, రైతులు పాల్గొన్నారు.

# పేరుకుపోయిన మురికి

### విష జ్వారాలతో అల్లాడుతున్న ప్రజలు
### చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు.

**కాశి నాయన జూన్ 8 ప్రభాతవార్త:**



కాశినాయన మండలం కత్తెర గండ్ల పంచాయతీ చెన్నవరం గ్రామంలో కొన్ని నెలలుగా పేరకపోయి పాచి పట్టి నల్లగా తయారై తయారైన వాటిపైన దోమలు వాలి ప్రజలకు కొట్టడంతో విష జ్వారాలు డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ కొన్ని జ్వరాలతో అల్లాడుతున్న పట్టించుకోకుండా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు ఇప్పటికైనా పై అధికారులు స్పందించి పేరుకుపోయిన మురికిని డ్రైనేజ్ కాలువలను కుళాయి కనెక్షన్లను మెరుగుపరిచి చేయించవలసిందిగా ప్రజలు వేడుకుంటున్నారు చేయని పక్షంలో జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకువెళ్తామని ఆ గ్రామ ప్రజలు తెలుపుతున్నారు.

# తంబళ్లపల్లె అభివృద్ధికి అధికార యంత్రాంగం కలిసి రావాలి

### ప్రత్యేక అధికారి మాధవ కృష్ణారెడ్డి




**తంబళ్లపల్లె జూన్ 9 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె మండల అభివృద్ధికి మండల స్థాయి అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది కలిసి రావాలని తంబళ్లపల్లె ప్రత్యేక అధికారి మాధవ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పంచాయతీల అభివృద్ధి పనులు నిర్వహణ, పెన్షన్లు పంపిణీ, పారిశుద్ధం, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ భారతి, జలధార జల హారతి లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వివరాలు, వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల పనితీరు, రుణాల పంపిణీ సద్వినియోగం, వ్యవసాయం, రైతు భరోసా, భూముల రీ సర్వే, రైతుల సమస్యల పరిష్కారం, విద్య, వైద్యం, సచివాలయాల పనితీరు పై ఆరా తీశారు. సచివాలయాల పరిధిలో అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కారానికి ముందు ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛంద కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదే విధంగా జల సంరక్షణ లో భాగంగా జలధార, జలహారతి కార్యక్రమాల ద్వారా ప్రతి ఉపాధి కూలికి పని కల్పించి వలసల నివారణకు సహకరించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ఎంపీ ప్రసాద్, ఎంఈఓ త్యాగరాజు, ఏఈలు వినోద్ కుమార్, రమణ, సుజాత, ఏపీఎం గంగాధర్, ఏపీవో అంజనప్ప, రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### చనిపోయిన వినియోగదారుని స్థానంలో

# చట్ట పరమైన వారసుడు లేదా ప్రతినిధి ఫిర్యాదును కొనసాగించవచ్చు

(ఢిల్లీ హైకోర్టు తీర్పు)

**బద్వేలు లీగల్, జూన్ 08 ప్రభాతవార్త:**

చనిపోయిన వినియోగదారుని స్థానంలో చట్ట పరమైన వారసుడు అనగా లీగల్ హైర్ లేదా ప్రతినిధి అతని తరుపున వినియోగదారుల ఫిర్యాదును కొన సాగించవచ్చునని ఢిల్లీ హైకోర్టు జస్టిస్ మనోజ్ జైన్ ధర్మాసనం తీర్పునిచ్చింది. వినియోగదారుల సంరక్షణ చట్టం–1986 ప్రకారమున్నూ మరియు హిందూ వారసత్వ చట్టం–1956 ప్రకారమున్నూ నిర్వహించబడిన క్లాస్–1, క్లాస్–2 వారసుల మధ్య ఏలాంటి తేడా లేదని ధర్మాసనం వెల్లడించింది. వివరాలలోకి వెళితే... ఓ ఆసుపత్రిలో సేవల లోపంతో ఓ వ్యక్తి మరణించాడన్న ఆరోపణల గురించి ఓ వైద్యుడిపై వినియోగదారుల కోర్టులో ఓ కేసు నమోదు కాగా ఈ కేసుకు సంబంధించి ఆ మరణించిన వ్యక్తి సోదరుడు (క్లాస్–2 వారసుడు) ఫిర్యాదును దాఖలు చేశాడు. దీనిపై సదరు వైద్యుడు అభ్యంతరం వ్యక్తం చేస్తూ చనిపోయిన వ్యక్తికి భార్య, పిల్లలు ఉన్నపుడు క్లాస్–2 వారసుడైన సహోదరుడికి చట్టబద్ధమైన హక్కు లేదని, తనపై ఎలా ఫిర్యాదు చేశారు? అని వాదించాడు. ఈ నేపథ్యంలో విచారణ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వినియోగదారుల సంరక్షణ చట్టం–1986 అనుసరించి సెక్షన్–2(1)(బి) ప్రకారం ఫిర్యాదుదారుడు ఎవరైనా కావొచ్చని తెలిపింది. కాగా చట్టబద్ధమైన వారసుడు, ప్రతినిధి అనే పదాలు చట్టంలో ఉన్నా వాటికి కఠినమైన పరిమితులు విధించరాదని పేర్కొనింది. చనిపోయిన వ్యక్తి స హోదరుడు విదేశీ వ్యక్తి కాదని, అతను చనిపోయిన వ్యక్తికి బంధువు లేదా ప్రతినిధిగా వ్యవహరించగలడని ధర్మాసనం వెల్లడించింది. ఈ కేసులో చనిపో యిన వ్యక్తి భార్య, కుమార్తె చిఱునామాలు తెలలియకపోవడంతో వారికి నోటీ సులు జారీ చేయలేదని అయితే తల్లి (క్లాస్–1 వారసురాలు) పార్టీగా చేర్చ బడ్డారని ధర్మాసనం పేర్కొనింది. వైద్యుడి పిటీషన్ త్రోసిపుచ్చుతూ ఈ కేసును త్వరగా పరిష్కరించాలని జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ (ఎన్‌సిడిఆర్‌సి)ను ధర్మాసనం ఆదేశిస్తూ మరణించిన వారి తరుపున చట్టబద్ధమైన వారసులు లేదా ప్రతినిధి వినియోగదారుల ఫిర్యాదును కొనసా గించవచ్చని తీర్పునిచ్చింది. (శీర్షిక: సౌమ్య భట్టాచార్య ఎదిరి సుధీర్ కుమార్ ఠాకూర్ మరియు ఇతరులు, కేసు నెం.సిఎం(ఎం) 757/2022)

## అంగన్వాడీ టీచర్లకు స్క్రీనింగ్ టెస్ట్ శిక్షణ..

**బ్రహ్మంగారిమఠం జూన్ 08 ప్రభాతవార్త**

మండలం కేంద్రంలోని కంది మల్లాయపల్లి జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్‌లో మండల స్థాయి అంగన్వాడీ టీచర్ లకు ఏ ఐ ఆధారిత స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమంనకు,53 మంది అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ ముంతాజ్ బేగం వైద్యాధికారి సంపంత్ మాట్లాడుతూ ఏఐ సాంకేతిక వినియోగం పిల్లల అభివృద్ధి మరియు స్క్రీనింగ్ ప్రక్రియలో ఏఐ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.అంగన్వాడి టీచర్లకు చిన్నారుల ఆరోగ్య,అభివృద్ధి సమస్యలను ప్రారంభ దశలోని గుర్తించేందుకు ఏఐ (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) ఆధారిత స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణపై ప్రత్యేక శిక్షణ,చిన్నారుల శారీరక మానసిక మరియు సంబంధిత సమస్యలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వేగంగా గుర్తించే విధానాలను అంగన్వాడి కేంద్రాలలో సేవలు పొందుతున్న చిన్నారులకు సేవలు అందించడంలో ఈ స్క్రీనింగ్ టెస్ట్ ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీ టీచర్లకి యాప్ వినియోగం డేటా నమోదు ప్రక్రియ ఫలితాల విశ్లేషణ తదితర అంశాలపై ప్రయోజిక శిక్షణ అందించడమైనది చిన్నారుల అభివృద్ధిలో ఏమైనా లోపాలు గుర్తించినట్లయితే వెంటనే సంబంధిత వైద్య సేవలకు అనుసంధానం చేయాలని సూచించారు. పిల్లల అభివృద్ధి మరియు స్క్రీనింగ్ ప్రక్రియ ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమలోసూపర్వైజర్స్ ప్రత్యూష, సుబ్బరత్న, వరలక్ష్మి సౌజన్య, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**దువ్వూరు, జూన్ 8, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వివిధ రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువ మంది రైతులు, విద్యార్థులు వచ్చి తమ దరఖాస్తులను అందజేశారు. రైతులు రీ సర్వేలో తప్పులు ఉన్నాయని అలాగే పాస్ బుక్కులో కొన్ని నెంబర్లు కూడా సరిగా లేవని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలలు తెరుస్తున్నందున తమకు అవసరమైన సర్టిఫికెట్ లు త్వరితగతిన అందజేయాలని వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీనారాయణ, వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి, ఏఈ శివప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో బీఎల్ ఏలు కీలక పాత్ర పోషించాలి

**పులివెందుల, జూన్ 8 , ప్రభాతవార్త :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ (బీఎల్ఏ) కీలక పాత్ర పోషించాలని తుంగభద్ర ప్రాజెక్టు హై లెవల్ కెనాల్ చైర్మన్, వేముల మండల పరిశీలకుడు మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ సర్వేపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు పూర్తి అవగాహన కలిగి ఉండాలనిసూచించారు. ఆదివారం పులివెందులలోని తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో వేముల మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలకు నిర్వహించిన బీఎల్ఏల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో సమర్థవంతంగా పని చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని అన్ని బూత్‌లలో జూన్ 15 నుంచి జూలై 15 వరకు చేపట్టనున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయడంతో పాటు ఫారం2ను సక్రమంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో వేముల మండల ఇన్‌చార్జి బ్రహ్మయ్య, శ్రీనాథ్ రెడ్డి, శివరాం రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి యాదవ్, రమణారెడ్డి, నాగభూషణ్ రెడ్డి, కస్తూరి రామన్న (ఏసు) తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## డబులింజన్ సర్కారు కాదు ట్రబులింజన్ సర్కార్

**వేంపల్లి:జూన్ 08 ప్రభాతవార్త**



కేంద్రంలో నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలన గురించి, రాష్ట్రంలో కూటమి రెండేళ్ల పాలన గురించి, డబులింజన్ సర్కార్ విజయ గాథల గురించి ప్రజల్లో ఉధృతంగా ప్రచారం చేయాలని చంద్రబాబు నాయుడు కూటమి శ్రేణులకు పిలుపు ఇవ్వడం హాస్యాస్పదమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ది రావణాసురుని పాలన కాగా రాష్ట్రంలో చంద్రబాబుది నరకాసుర పాలన అని తులసిరెడ్డి విరుచుకుపడ్డారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కూటమిది డబులింజన్ సర్కారు పాలన కాదని ట్రబులింజన్ సర్కారు పాలనని, డొక్కింజిన్ సర్కారు పాలనని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.

## దారి సమస్యపై తహసీల్దారుకు ఫిర్యాదు



**కలికిరి, జూన్ 8, ప్రభాతవార్త:**

మండలంలోని గుట్టపాలెం పంచాయతీ సామికుంటవారిపల్లికు చెందిన గ్రామస్థులు సోమవారం గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో తహసీల్దార్ సయిద్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. నుంచి గుట్టమీదపల్లె వరకు ఉన్న రోడ్డు సానుకుంటవారిపల్లి రోడ్డు వేసేందుకు ఉత్తర్వులు వచ్చాయి. ఆ రోడ్డు లేకుండా ఫెన్సింగ్ వేయడం జరుగుతోందని సమస్యను పరిష్కరించాలని వారు ఈసందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పి.రవీంద్రనాథ్‌రెడ్డి, చంద్రారెడ్డి, గోవిందు, వెంకటరమణ, రెడ్డప్పరెడ్డి, గురుప్రసాద్, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మండల కాంప్లెక్స్‌లో

# స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేయాలి

**నందలూరు, జూన్ 8 ప్రభాతవార్త :**



మండలానికి మంజూరైన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్‌ను మండల కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేయాలని సిటిజన్ సంస్థ అధ్యక్షుడు ఆర్మగం విశ్వనాథ్ మండల విద్యాశాఖాధికారి అనంతకృష్ణను కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల కాంప్లెక్స్‌లో తహసీల్దార్, ఎంపీడీవో తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో అధికారుల పర్యవేక్షణ నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆహార నాణ్యతను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు, పాఠశాలలకు భోజనం సరఫరా సులభతరం చేయడానికి ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగించుకోవచ్చని, అవసరమైతే కొత్త భవన నిర్మాణానికి తగిన స్థలం కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు.జాతీయ రహదారి సమీపంలో ఉండటంతో జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు సైతం సులభంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రతిపాదనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మండల కాంప్లెక్స్‌లోనే సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అమీర్, సయ్యద్ జుల్ఫికర్ పాల్గొన్నారు.

# ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డీఏపీ పంపిణీ

**పులివెందుల ,జూన్ 8, ప్రభాతవార్త :**

ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డీఏపీ పంపిణీ చేయడం జరుగుతుం దని అర్హులైన రైతులకే ఎరువుల కేటాయింపు జరుగుతుంది అని రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా ఎమ్మార్పీ (గరిష్ఠ చిల్లర ధర)ని పరిశీలించి కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు (జేడీఏ) సుబ్రహ్మణ్యే శ్వరరావు సూచించారు. మంగళవారం పులివెందుల పట్టణంలోని ధరణి క్రాప్ కేర్ ఎరువుల దుకాణంలో ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలు (ఆర్‌బీకేలు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ప్రైవేట్ డీలర్ల ద్వారా ఎరువుల పంపిణీ ప్రారంభించామని తెలిపారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతుకు వారి అర్హతను బట్టి ప్రభుత్వం నిర్ణయించిన మేరకు యూరియా, డీఏపీ ఎరువులను ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పంటలు సాగు చేయని రైతులకుతి ఎరువుల పంపిణీ ఉండదని స్పష్టం చేశారు. ఎరువుల కొనుగోలు సమయంలో రైతులు బిల్లులు తీసుకోవడంతో పాటు ఎమ్మార్పీ ధరను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేడీఏ మాధవి, వ్యవసాయ అధికారి కృష్ణ సుమంత్ రెడ్డి, పులివెందుల టెక్నికల్ ఏవో సునీల్ కుమార్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వి. చెన్నారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 8, ప్రభాతవార్త:**

మద్యం తాగిన మత్తులో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు రూరల్ సీఐ నాగభూషణ్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ పర్యవేక్షణలో సోమవారం సాయంత్రం అమృతనగర్‌లోని స్థానికులకు నాగభూషణ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఆపద సమయంలో డయల్ 112, 1098, 181, 1091, 1930, సైబర్ మిత్ర తదితర నంబర్ల ఉపయోగాలు వివరించారు. రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



## వాహనం ఢీకొని 20 గొర్రెలు మృతి

**లక్కిరెడ్డిపల్లె: జూన్ 08 ప్రభాతవార్త**

మండలంలోని లక్కిరెడ్డిపల్లె సమీపంలోని దాసిరెడ్డి మిట్ట సమీపంలో ఆదివారం అర్ధరాత్రి బొలెరో సుమో గొర్రెల మందపై దూసుకెళ్లి అక్కడికక్కడే 10 గొర్రెలు మృతి చెందగా గాయపడిన గొర్రెలు తెల్లవారి 9 గంటలకు మరో 10 గొర్రెలు మృతి చెందినట్లు గొర్రెల యజమాని దశరథ లో తెలిపారు. సర్వేపల్లి మండలం రైతు కుంట గ్రామం గుట్టకింద పల్లి చెందిన గొర్రెల కాపరులు సంబేపల్లి ప్రాంతంలో గొర్రెలకు మేత లేకపోవడంతో లక్కిరెడ్డిపల్లి మండలంలో ఈ మధ్యన కురిసిన వర్షానికి మేత పడిందని దాదాపు రెండువేల గొర్రెలు మేపు కోసం లక్కిరెడ్డిపల్లికి వస్తుండగా దాసిరెడ్డి మిట్ట వద్ద ఈ సంఘటన చోటు చేస్తుంది. బులోరో వేంపల్లి నుంచి రాయచోటి వైపు వస్తుండగా రాయచోటి వైపు నుంచి లక్కిరెడ్డిపల్లి వైపు వస్తుండగా ఈ సంఘటన చోటు చేస్తుందని గొర్రెల యజమానులు తెలిపారు. ఈ మేరకు ఉదయాన్నే సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని విచారించి పోలవరం స్వాధీనం చేసుకున్నట్లు పశువుల కాపరులు తెలిపారు. ఏది ఏమైనా 20 గొర్రెలు మూడు లక్షల 50 వేల రూపాయలు ఖరీదు అవుతాయని నిరుపేదలకు అన్యాయం జరిగిందని వారు వాపోయారు. ఏదేమైనా పరిహారము అందించాలని వాళ్ల కోరారు.



మృతి చెందిన గొర్రెలు

## మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు

**కలసపాడు, జూన్ 6 ప్రభాతవార్త:**

మండలంలో కలసపాడు ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఏర్పా టు చేయడమైనదనీ డిప్యూటీ ఎంపీడీవో మురళీమోహన్ తెలిపారు. ఈ సమా వేశం మండల ప్రజా పరిషత్ సభాభవనంలో కలసపాడు మండలాధ్యక్షులు బోధన బోయిన నిర్మలాదేవి అధ్యక్షతన జరుగన్నారన్నారు. మండల సర్వస సమావేశం నకు మండలంలోని మండల అధికారులు , 13 గ్రామ పంచాయతీల కార్యదర్శులు ప్రజా ప్రతి నిధులు, 13 గ్రామ పంచాయతీ ఎంపీ టీసీలు కోఆప్షన్ మేంబర్, అన్ని శాఖలకు సంబందించిన అధి కారులు తమ శాఖకు సంబందించిన వివరాలు రికార్డులతో తప్పక హాజరన్నారు.

### 40 శాతం సబ్సిడీతో

# వేరుశనక్కాయల పంపిణీ

**పులివెందుల, జూన్ 8 ప్రభాతవార్త :**

పులివెందుల మండల రైతులకు 40 శాతం సబ్సిడీపై వేరుశనక్కాయల పంపిణీ చేపట్టనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి. చెన్నారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాకు వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు మంగళవారం నుంచి మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదులు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. మండలానికి మొత్తం 120 క్వింటాళ్ల వేరుశనక్కాయలు మంజూరయ్యాయని, వాటిని అర్హులైన రైతులకు సబ్సిడీపై అందజేయనున్నట్లు తెలిపారు. ఒక క్వింటాల్ వేరుశనక్కాయల ధర రూ.10,200 కాగా, ఇందులో ప్రభుత్వం 40 శాతం సబ్సిడీగా రూ.4,080 భరిస్తుందని చెప్పారు. రైతులు తమ వాటాగా రూ.6,120 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రైతుల సాగు విస్తీర్ణాన్ని ఆధారంగా తీసుకుని గరిష్టంగా ఒక్కో రైతుకు 90 కిలోల వరకు వేరుశనక్కాయలు అందజేస్తామని తెలిపారు. వేరుశనగ సాగు చేసే రైతులు తమ భూమి పాస్‌బుక్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో సమీప రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియ పూర్తయిన వెంటనే వేరుశనక్కాయల పంపిణీ ప్రారంభిస్తామని ఎంఏఓ చెన్నారెడ్డి తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అమ్మాయి తలలో పేలా?

**చదరువుతున్నా, నిద్రపోతున్నా కొంత మంది చిన్న పిల్లలు అసంకల్పితంగా తలను గోక్కుంటూనే ఉంటారు. పేల సమస్యే ఇందుకు కారణం. చిన్నారి మనస్వి జుట్టేమో ఎప్పుడూ నిర్జీవంగానే కనిపిస్తుంది. తల దువ్వుతుంటే చాలు చుండ్రు పొట్టులా రాలుతుంది.** పిల్లల కురులు ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియక సతమతమవుతుంటారు చాలామంది తల్లులు. అలాంటివారికోసమే ఈ చిట్కాలు.

**తడి లేకుండా..** ఆటపాటల్లో మునిగి తేలే చిన్నారులకు చెమట ఎక్కువగా పడుతుంది. పనుల ఒత్తిడో, తరవాత మాట వినరనే అనుమానమో చాలామంది తల్లులు.. తలస్నానం చేశాక తడి పూర్తిగా ఆరకుండానే రబ్బరు బ్యాండ్ పెట్టేస్తారు. ఇలా చేయడం వల్లా చుండ్రు ఇబ్బంది పెడుతుంది. జుట్టూ నిర్జీవంగా మారుతుంది. అలాకాకుండా జుట్టుని పూర్తిగా ఆరనిచ్చాక జడ వేయడం, రోజు విడిచి రోజు తప్పనిసరిగా తలస్నానం చేయడం అలవాటు చేయాలి. ఇలా చేస్తే చుండ్రు దరిచేరదు.

**పేలు లేకుండా...** తలస్నానం చేయడానికి ముందు కప్పు కొబ్బరినూనెలో రెండు చుక్కల వేపనూనె కలిపి తలకు రాసి మర్దన చేయండి. అరగంటయ్యాక గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరి. ఇలా వారినికోసారి చేస్తుంటే సమస్య దూరమవుతుంది. లేదంటే ఆముదం కొబ్బరినూనె మిశ్రమాన్నీ పట్టించొచ్చు. వేప, ఆముదంలో ఉండే రసాయనాలు, చేదు.. పేలు పారిపోయేలా చేస్తాయి.

**నిగనిగలాడేలా:** కొబ్బరినూనెలో పచ్చి ఉసిరి ముక్కలు, కాసిన్ని మెంతులు వేసి మరిగించండి. దీన్ని తలస్నానం చేయడానికి ముందు రాసుకోండి. అలానే శీకాయ, కుంకుడు కాయల్ని నీళ్లల్లో ఉడికించి రసం తీయండి. ఈ మిశ్రమాన్ని గాలిచొరని సీసాలో పోసుకుని నేచురల్ షాంపూలా వాడుకోండి. ఇవి బుజ్జాయి జుట్టుని ఆరోగ్యంగా ఉంచడంతో పాటు నిగనిగలాడేలా చేస్తాయి.

## గడ్డి వామి దగ్ధం, లక్ష నష్టం

**దువ్వూరు, జూన్ 8, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని భీముని పాడు గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు గడ్డి వామి కాలిపోవడంతో సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భీముని పాడు గ్రామానికి చెందిన శీలం బాల నారాయణ రెడ్డి తన పశువులను మేపుకునేందుకు గాను సుమారు 600కట్టలు కట్టి గడ్డి వామి వేసుకున్నాడు. సోమవారం ప్రమాదవశాత్తు గడ్డివామి కాలిపోయింది. దీంతో తనకు లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ప్రస్తుతం పశువుల కోసం గడ్డి కూడా లేదని, ఎక్కడైనా కొనేందుకు కూడా వీలు పడటం లేదని రైతు వాపోయాడు. తనకు ప్రభుత్వం తరఫున ఏదైనా సహాయం చేయాలని కోరాడు.

# ఈనెల 18,19,20 న వైభవంగా జాంబవంత నగర్ కోదండ రామాలయం విగ్రప్రతిష్ట మహోత్సవం

### పలువురు నాయకులకు దాతలకు ఆహ్వాన పత్రికలు అందజేసిన కమిటీ సభ్యులు

**బద్వేల్ అర్బన్ జూన్ 08 ప్రభాతవార్త :**

మున్సిపాలిటీ పరిధి జాంబవంత నగర్ కోదండ రామాలయం విగ్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం జూన్ 18, 19, 20వ తారీకులలో మూడు రోజుల పాటు వేద పండితులు సత్యనారాయణ శర్మ బృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం జరుగుతుంది, 15 సంవత్సరాల క్రితం ఆగిపోయిన కోదండ రామాలయం పునః నిర్మాణం పలువురు దాతల సహాయ సహకారాలతో దాదాపు 15,00,000 వ్యయంతో కోదండ రామాలయం పుణ నిర్మాణం మరియు విగ్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా కనుల పండగ నిర్వహించేందుకు అభివృద్ధి కమిటీ సభ్యులు ముందస్తుగా అన్ని రకాల ఏర్పాట్లను చేపట్టడం జరిగింది, సోమవారం బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ రితేష్ రెడ్డి, కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, టిడిపి మున్సిపల్ అధ్యక్షులు గుర్రంపాటి వెంగల్రెడ్డి, సీనియర్ నాయకులు కనుమల్ల పూటి ప్రసాద్, సింగం పల్లె శివయ్య స్వామి, మల్లికార్జున రెడ్డి సాంబశివారెడ్డి, సీనియర్ అడ్వకేట్ పీఏఎన్ ప్రసాద్, స్టేట్ డైరెక్టర్ కెవి సుబ్బారావు, తుమ్మలపెంట సురేష్ బాబు, సముద్రాల రాధాకృష్ణమూర్తి, మానవతా అధ్యక్షులు





నాగిరెడ్డి శంకర్ రెడ్డి, సంద్ర శ్రీనివాసులు యాదవ్, కామిరెడ్డి సుధాకర్ రెడ్డి, వంకెల పెద్ద పోలిరెడ్డి, ఈగ యద్దారెడ్డి, అర్బన్ సీఐ రామకృష్ణ, ఎస్సై కొండారెడ్డి మరియు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ పల్లె సుబ్బారెడ్డి, ఆరవ శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోపాలస్వామి, లక్ష్మీ విద్యారణ్య పాఠశాల కరస్పాండెంట్ శంకర్ రెడ్డి మరియు ఆలయ అభివృద్ధికి సహకరించిన పలువురు దాతలకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వల్లంకొండు వెంకటరమణ,,కెవి సుబ్బారావు, పెద్ది సుధాకర్, కాలువ నాగేంద్ర, హరితోపాటు పలువురు కమిటీ సభ్యులు స్వామివారి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి పలువురికి ఆహ్వానం పలికారు,ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు దాతలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బద్వేల్ సమస్యలపై జిల్లా అధికారులకు వినతిపత్రాలు

**బద్వేలు, జూన్ 8, ప్రభాతవార్త**

పట్టణంలో జరుగుతున్న భూ ఆక్రమణలు, అవినీతి అక్రమాలు మరి యు ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న పార్టీ నాయకులపై నమోదైన కేసుల అంశాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి బండెల ఓబయ్య ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఎస్పీ, డీఆర్ఓ, నీటిపారుదల శాఖ ఎస్ఈ, డ్రగ్స్ కంట్రోల్ మరియు విజిలెన్స్ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఓబయ్య, జిల్లా కమిటీ సభ్యుడు జకరయ్య మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలోని ప్రభుత్వ భూములు, చెరువులు, వాగులు కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆరోపించారు. ఈ విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్న పార్టీ నాయకులపై కక్షపూరితంగా కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకుడు చంద్రశేఖర్‌పై నమోదు చేసిన కేసు విషయంలో పూర్తి స్థాయి విచారణ జరిపి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీకి ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నాగుల చెరువుకు సంబంధించిన భూ ఆక్రమణ అంశంపై ఫిర్యాదు చేసిన తర్వాత చంద్రశేఖర్‌ను నోటీసు లేకుండా అరెస్టు చేయడం, గంటల తరబడి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం అన్యాయమని ఆరోపించారు. అలాగే బద్వేల్ పట్టణంలోని సర్వే నంబర్లు 1169, 1170, 1784, 1852/1, 1848/1, 1848/2 లోని ప్రభుత్వ భూములను రక్షించాలని డీఆర్ఓ, నీటిపారుదల శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తులపై అక్రమ కేసులు బనాయించడం మానుకుని ప్రజల పక్షాన నిలవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్, నియోజకవర్గ కమిటీ సభ్యులు విజయరావు, కే. బాబు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



### మరమ్మతులకు

# 50 లక్షలు మంజూరు

**దువ్వూరు, జూన్ 08, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని చింతకుంట, దువ్వూరు చెరువుల మరమ్మతులకు గాను జలధార జీవనధార పథకం కింద 50 లక్షల రూపాయల మేర నిధులు మంజూరైనట్లు సంబంధిత అధికారి ఏఈ రామ్మోహన్ తెలిపారు. దువ్వూరు చెరువులో తూము మరమ్మతులకు అలాగే అలుగు నిర్మాణానికి, చెరువు చుట్టూ కంచె వేయుటకు గాను 14 లక్షల రూపాయలు మంజూరు చేశారు అన్నారు. అలాగే వంకలో మట్టిని తొలగించేందుకు కూడా ఏర్పాటు చేశారన్నారు. చింతకుంట చెరువులో వివిధ రకాల పనులకు 10 లక్షల 50 వేల రూపాయలు అలాగే గుడిపాడు, రామాపురం, దాసరి పల్లె గ్రామాల్లో మరమ్మతులకు నోచుకోని చెక్ డ్యామ్ లను తిరిగి మరమ్మత్తులు చేసేందుకు గాను 26 లక్షల రూపాయలు కేటాయించారు అన్నారు. ఈ నిధులను జూన్ ఆఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఈ పనులన్నీ ఆయా చెరువు నీటి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అలరించిన చిన్నారి రిచిక నృత్యం

**కలికిరి, జూన్ 8, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని కలికిరి–కలకడ రోడ్డు మార్గంలోని అంకాలమ్మ ఆలయ ఆవరణంలో జరిగిన వారాహి గ్లోబల్ ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవ వేడుకలో చిన్నారి వాసనూరి రిచిక చేసిన బ్రహ్మ ఒక్కడే అనే పాటకు నృత్యం అందరిని అలరించింది. వార్షికోత్సవ వేడుకలు సంస్థ వ్యవస్థాపకురాలు నాగలక్ష్మి, సంస్థ డైరెక్టర్ సురేష్, సభ్యులు వాసనూరి కిశోర్‌కుమార్ పలువురి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొని నృత్యాలు, నాట్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారి వాసనూరి రిచిక చేసిన నృత్యం అందరినీ అలరింపజేసింది. ఆ చిన్నారి వారాహి గ్లోబల్ ఆర్ట్స్ అకాడమి చిన్నారి కిశోర్‌కుమార్, గోమతిల కుమార్తె. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మండల ప్రజలు, విద్యార్థులు హాజరయ్యారు. చిన్నారి రిచిక చేసిన నృత్యాన్ని చూసి పలువురు అభినందించారు. కలికిరి మండల కేంద్రంలో వారాహి గ్లోబల్ ఆర్ట్ అకాడమి ఏర్పాటు చేసి పలువురు చిన్నారులను కళాకారులుగా తీర్చిదిద్ది ప్రతిభావంతులుగా చేసిన సంస్థ వ్యవస్థాపకులు, డైరెక్టరును పలువురు అభినందించారు.

టమాటో ప్రాసెసింగ్‌పై

# ఎస్సీ మహిళలు, యువతకు నైపుణ్య శిక్షణ

పులివెందుల ఆహార సాంకేతిక కళాశాలలో ఐసీఏఆర్ ఉప ప్రణాళిక కార్యక్రమం


టమోటా స్టోరేజ్ విధానాన్ని గురించి వివరిస్తున్న దృశ్యం


టమోటా ప్రాసెసింగ్ గురించి శిక్షణ ఇస్తున్న దృశ్యం

**పులివెందుల, జూన్ 8, ప్రభాతవార్త :**
పులివెందుల ఆహార సాంకేతిక కళాశాలలో "టమాటో ప్రాసెసింగ్, విలువ జోడింపుపై నైపుణ్య అభివృద్ధి" అంశంపై ఐసీఏఆర్ షెడ్యూల్డ్ కుల ఉప ప్రణాళిక ప్రాజెక్టు ఆధ్వర్యంలో రెండో శిక్షణా కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎద్దులయేని గ్రామం, పులివెందుల మండలం పరిసర ప్రాంతాలకు చెందిన ఎస్సీ మహిళలు, యువత, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళాశాల ఇన్‌ఛార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్. అరుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మెప్మా సిటీ మిషన్ మేనేజర్ నాగలక్ష్మి ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాజెక్టు ఇన్‌ఛార్జి ఇంజినీర్ నజ్మా మాట్లాడుతూ టమాటో ధరలు గిట్టుబాటు కాకపోయే సమయంలో టమాటోను ప్రాసెస్ చేసి టమాటో సాస్, కెచప్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్. అరుణ మాట్లాడుతూ టమాటో ప్రాసెసింగ్‌లోని సాంకేతిక అంశాలు, నాణ్యత ప్రమాణాలు, జాగ్రత్తలను శిక్షణార్థులు క్షుణ్ణంగా నేర్చుకోవాలని సూచించారు. కళాశాల నిపుణుల పర్యవేక్షణలో టమాటో ప్రాసెసింగ్ యంత్రాలను ఉపయోగించి టమాటో గుజ్జు, టమాటో సాస్ తయారీపై ప్రాక్టికల్ శిక్షణ అందించారు. అలాగే కళాశాలలో ఏర్పాటు చేసిన సౌరశక్తితో పనిచేసే కోల్డ్ స్టోరేజ్ రూమ్‌ను శిక్షణార్థులకు చూపించి, టమాటోలు మరియు ఇతర పండ్లను నిల్వ ఉంచే విధానాన్ని ఇంజినీర్ నజ్మా వివరించారు. సౌరశక్తి ఆధారిత కోల్డ్ స్టోరేజ్‌లు రైతులకు ఎంతో ఉపయోగకరమని, పంటలను ఎక్కువ కాలం భద్రపరచుకునే అవకాశం కల్పిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల నిపుణులు రూపొందించిన శిక్షణ మాన్యువల్ బుక్‌లెట్‌లను ఎస్సీ అభ్యర్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకీర్ భాషా, పీడీ డాక్టర్ రాజశేఖర్, కళాశాల సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.

## విఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విఆర్వోలు

**చౌడేపల్లి, జూన్ 8 ప్రభాతవార్త**
విఆర్వోలపై పని ఒత్తిడిని తగ్గించాలని మండలంలోని విఆర్వోలందరూ స్థానిక పరిపాలనా భవనం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసారు. కర్నూలు జిల్లా వెంకయ్యపాలెంకు చెందిన విఆర్వో మహ్మద్‌భాషా పని ఒత్తిడి మూలంగా ఆత్మహత్య చేసుకొన్న విషయం విధితమే. రాష్ట్ర విఆర్వోల సంఘం నాయకుల పిలుపుమేరకు మండలంలోని విఆర్వోలు, సర్వేయర్లు ఆందోళన చేపట్టారు. రోజురోజుకూ విఆర్వోలపై పనిభారం అధికమౌతోందనీ, తగ్గించి న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం తహశీల్దార్ భూపతి పార్వతికి వినతిపత్రమందించారు. సంఘ నాయకులు రెడ్డెప్ప, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, జీవనజ్యోతి, సుప్రియ, శ్రీజ, దేవ, యశోద, మంజుల, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అమ్మవారి జాతరలు

**కలికిరి, జూన్ 8, ప్రభాతవార్త:**
మండలంలోని గుండ్లూరు పంచాయతీలో జరిగిన శ్రీ మూలస్థానమ్మ అమ్మవారి జాతర, గుట్టపాలెం పంచాయతీలో జరిగిన పాలేటమ్మ అమ్మవారి జాతర కలికిరి సీఐ అనిల్‌కుమార్ చొరవతో జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిశాయి. జాతరల సందర్భంగా సీఐ అనిల్‌కుమార్ జిల్లా పోలీసు అధికారుల ఆదేశాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ఎలాంటి ఘటనలు జరగకుండా జాతరలు ప్రశాంతంగా ముగిశాయి.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



**వేంపల్లె: జూన్ 08. ప్రభాతవార్త**
వ్యవసాయ శాఖ చేపట్టిన పారదర్శక ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎం. సుబ్రహ్మణ్యేశ్వరరావు సూచించారు. సోమవారం పులివెందుల, వేంపల్లె మండలాల్లోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా రైతులకు సబ్సిడీ ఎరువులను పారదర్శకంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు, విస్తీర్ణం ఆధారంగా యూరియా, డీఏపీ తదితర ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే అందించాలని ఎరువుల దుకాణదారులకు ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల ద్వారా ఏపీ ఎయిమ్స్ యాప్‌లో నమోదు చేసిన రైతులకు మాత్రమే నిర్దేశిత మోతాదులో ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. యాప్‌ను తప్పనిసరిగా వినియోగిస్తూ ఎరువుల పంపిణీ చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ సహాయ సంచాలకురాలు (ఏడీ) మాధవి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సుమంత్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు చెన్నారెడ్డి, బాలగంగాధర్‌రెడ్డి, ఏఈఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## డిపాజిట్ దారులకు ఆందోళన వద్దు

డివిజనల్ కోపరేటివ్ ఆఫీసర్ సత్యానందం వెల్లడి

**ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 8 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు టౌన్ బ్యాంక్ లోని డిపాజిట్ దారుల డిపాజిట్లకు ఎలాంటి డోకా లేదని ఆందోళన చెందవద్దని డివిజనల్ కోఆపరేటివ్ అధికారి సత్యానందం తెలిపారు. సోమవారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని సహకార శాఖ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం లో మాట్లాడుతూ ప్రస్తుతం టౌన్ బ్యాంకులో సుమారు రూ.81 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని వెల్లడించారు. ఇందులో భాగంగా సభ్యులకు దాదాపు రూ.58 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ సెక్యూరిటీల్లో రూ.18 కోట్లు, ఇతర బ్యాంకుల్లో రూ.6.78 కోట్లు పెట్టుబడులుగా ఉంచామని, అదనంగా రూ.13.30 కోట్లు కరెంట్ అకౌంట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. సహకార చట్ట నిబంధనలకు అనుగుణంగానే రుణాల మంజూరు, వసూళ్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సంఘం కార్యకలాపాలు సహకార శాఖతో పాటు ఆర్థిక నియంత్రణ సంస్థల పర్యవేక్షణలో కొనసాగుతున్నందున డిపాజిటర్ల కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తే పరిస్థితి లేదన్నారు. సంఘం ఆర్థిక వ్యవహారాలు పారదర్శకంగా కొనసాగుతున్నాయని, డిపాజిటర్ల నిధులు పూర్తిగా భద్రంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

పాల పూజతో

## ముగిసిన శ్రీ మారెమ్మ తల్లి జాతర

**నందలూరు, జూన్ 8 ప్రభాతవార్త :**



మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ తల్లి జాతర మహోత్సవాలు సోమవారం నిర్వహించిన పాల పూజ కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. జాతరలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పాలాభిషేకం, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు పండితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అమ్మవారికి పాల పూజ నిర్వహించి శాంతింపజేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జాతర చివరి రోజు కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. పాల పూజ కార్యక్రమంతో ఈ ఏడాది శ్రీ మారెమ్మ తల్లి జాతర మహోత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

## పిజిఆర్ఎస్ అర్జీలను గడువులోపల పరిష్కరించాలి : కలెక్టర్

**మదనపల్లె, జూన్ 8 ప్రభాతవార్త :**
పిజిఆర్ఎస్ అర్జీలను గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో ప్రజలు విన్నవించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. సమస్యను బట్టి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు 326అర్జీలను ధరఖాస్తు రూపంలో కలెక్టర్‌కు విన్నవించారు. మదనపల్లె, బి.కొత్తకోట మండలాలకు చెందిన భూ సమస్యలను ప్రజలు ఎక్కువగా విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డిఆర్‌ఓ చంద్రశేఖర్, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణిలు పాల్గొన్నారు. జలవనరుల ఆక్రమణలపై కలెక్టర్‌కు బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్‌కుమార్ విన్నవించారు. చెరువులు, వంకలు, వాగులను కబ్జాదారుల నుంచి సంరక్షించాలని కోరారు.


విన్నవిస్తున్న దృశ్యం

## సిబ్బంది కొరతపై సబ్ కలెక్టర్‌కు వినతి



**నందలూరు, జూన్ 8 ప్రభాతవార్త:**
మండల తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిటిజన్ సంస్థ అధ్యక్షుడు ఆర్ముగం విశ్వనాథ్ రాజంపేట సబ్ కలెక్టర్ భావనకు వినతిపత్రం సమర్పించారు. కార్యాలయంలో టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్, వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉండటంతో రైతులు, విద్యార్థులు, వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చే ప్రజలకు సేవలు ఆలస్యమవుతున్నాయని ఆయన తెలిపారు. ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిమగిరినాథ్ యాదవ్, సయ్యద్ అమీర్, అర్జునుడు, జుల్ఫికర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో జరిగిన అవకతవకలపై

## సిబిఐ ఎంక్వయిరీ ద్వారా విచారణ జరపండి : సుధాకర్




**మదనపల్లి, జూన్ 8 ప్రభాతవార్త**
మదనపల్లిలో జరిగినటువంటి దగా డియస్సి పైన వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం డీఎస్సీ లో జరిగిన అవకతవకలు మీద సిబిఐ ఎంక్వైరీ చేయాలని వైఎస్ ఆర్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్ బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారావు సూచనల ప్రకారం సోమవారం మదనపల్లి కలెక్టరేట్ నందు కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అంతకుముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. డీఎస్సీ ఉద్యోగాల ఎంపికలో అవినీతి జరిగిందని కనుక సిబిఐ తో ఎంక్వైరీ చేయాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ఎస్సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి హరి,జిల్లా అధ్యక్షులు అంజనప్ప,జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్, నియోజక వర్గ అధ్యక్షులు ప్రసాద్, వెలుగు చంద్ర, మండల్ సెకరటరీ అంబరీష్, ఎస్సి మహిళా నాయకురాలు మణి, మాల తోటి నరేష్, ఎస్సి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ళ కూటమి పాలనలో ప్రజలను మోసగించిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, వైకాపా ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్‌లు

**మదనపల్లె, జూన్ 8 ప్రభాతవార్త :**
రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు అన్ని విధాల మోసపోయారని మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్‌లు తెలిపారు. సోమవారం పట్టణంలోని దేశాయ్ ఫంక్షన్‌హాలులో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ళు అనే అంశంపై ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి వైఎస్ఆర్‌సిపి నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, మేథావులు, సామాజిక కార్యకర్తలు, యువజన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపద్దాల హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్ళల్లో ప్రజలను అన్ని విధాల మోసగించిందన్నారు. వికలాంగులను సైతం ప్రభుత్వం వేధిస్తోందన్నారు. వికలాంగుల పెన్షన్ల దాటివేయడానికి సదరన్ స్లాట్ బుకింగ్ క్లోజ్ చేయడంతో సదరన్ సర్టిఫికెట్ల కోసం నానాపాట్లు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. సూపర్‌సిక్స్ హామీలు గాలికి వదిలివేశారని విమర్శించారు. డీజల్, పెట్రోల్ ధరలు పెంచి సామాన్యప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మహిళలు, యువత, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు కూటమి పాలనలో పూర్తిగా మోసపోయారన్నారు. అనంతరం రౌండ్‌టేబుల్ సమావేశంలో కూటమిప్రభుత్వ దురాగతాలపై ఏర్పాటు చేసిన పోటో ఎగ్జిబ్యూషన్ అందరిని ఆకట్టుకొంది. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మెన్ మనూజారెడ్డి, వైస్‌ఛైర్మెన్ జింకాచలపతి, సిపిఐ నాయకులు క్రిష్ణప్ప, మురళి, యువజన నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ అనీల్‌కుమార్‌రెడ్డి, మస్తాన్‌ఖాన్, కరుణాకర్‌రెడ్డి, ఆవుల మల్లికార్జున, వివిఎస్.రెడ్డి, రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ


పాఠ్యపుస్తకాలు అందుకున్న విద్యార్థులు

**రాజంపేట, జూన్ 8 ప్రభాతవార్త**
జిల్లా ఉపవిద్యాశాఖాధికారి నాగయ్య సోమవారం స్థానిక జెడ్‌పి బాలికల జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. విద్యార్థులకు క్లాసులు ప్రారంభం కాకముందే పార్టీ పుస్తకాలు అందించాలని ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం ఎంఈఓలు చక్రధర్ రాజు, రఘునాథరాజు, సుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ కె. జయలక్ష్మి అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సర్ ఓటర్ల జాబితాపై శిక్షణ

**దువ్వూరు, జూన్ 8, ప్రభాతవార్త:**



ఈ నెల 15వ తేదీ నుండి చేపట్టే సర్ ఓటర్ల జాబితాపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవన్ లో బిఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో తహసిల్దార్ సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సర్ మ్యాపింగ్ చేయాలని, సర్ మ్యాపింగ్ విధానాన్ని 15వ తేదీలోగా పూర్తి చేసి అనంతరం ప్రతి ఇంటికి బిఎల్‌ఓ వెళ్లాలన్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత ప్రతి కుటుంబంలోని ఓటర్ల జాబితాను పరిశీలించి వారికి ఒక దరఖాస్తు అందజేయాలన్నారు. ఆ దరఖాస్తును పూర్తి చేసి తిరిగి తీసుకొని ఓటర్ల జాబితాలో పరిశీలించాలన్నారు. సమగ్రమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అందువల్ల బిఎల్‌ఓ లు ఎటువంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను తయారు చేయవలసి ఉంటుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌వోలు చేస్తున్న ఓటర్ నమోదుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

**లక్కిరెడ్డిపల్లి: జూన్ 08 ప్రభాతవార్త**
బిఎల్‌వోలు చేస్తున్న ఓటర్ నమోదుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మంత్రి సోదరుడు రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మర్రిచెట్టు వద్ద మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు బూత్ కన్వీనర్లు బిఎల్‌ఎ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన బిఎల్వోలు చేస్తున్న ఓటర్ మ్యాపింగ్‌ను ప్రతి ఒక్క ఓటర్ మ్యాపింగు చేయించుకోవాలన్నారు. ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ ఓటర్ మ్యాపింగ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలా లేని పక్షంలో ఓటు తొలిగిపోయే పరిస్థితులు ఉన్నాయని ప్రతి ఒక్కరూ బిఎల్వోలుకు సహకరించి ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. ఈనెల 15 నుంచి డోర్ టు డోర్ బిఎల్వోలు తిరిగి ఓటర్ కార్యక్రమం చేస్తామన్నారు. ప్రతి కార్యకర్త బూతు లెవల్ లో పార్టీ కోసం కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం జెండా ఎగురవేయాలన్నారు. దాని కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండీ షఫినాయక్, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, క్లస్టర్ కన్వీనర్ శంకరపు జయరాం, మద్దిరేవుల సింగల్ విండో అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు యాదవ్, దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేష్, టిడిపి నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ షేక్ ఆరీఫ్, సిద్దక వెంకటరామిరెడ్డి, బోనాల ధనుంజయ, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ కేశవయ్య, సుధీర్ కుమార్, పెద్దరెడ్డి యాదవ్, యోగాంజనేయులు, యోగార్జున్ రెడ్డి, అన్వర్ భాష, ముక్తార్ అహ్మద్, ప్రతాపరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు ఫకీరయ్య, ధర్మారెడ్డి, దండే శ్రీనివాసులు, పార్లమెంట్ అధికార ప్రతినిధి రమ్య రాయల్, తెలుగు మహిళ అధ్యక్షురాలు పూజ, టీడీపీ నాయకులు కార్యకర్తలు యూనిట్ మరియు బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి

22 గ్రాములు వెండి ఉంగరాలు,

# 92 గ్రాములు బంగారు నగలు స్వాధీనం

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 8, ప్రభాతవార్త:**
బంగారు, వెండి వస్తువులు చోరీ చేసిన కేసులో ముద్దాయిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 92 గ్రాములు బంగారు నగలు, 22 గ్రాములు వవెండి ఉంగరాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ విభూకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్ పరిధిలోని ముద్దాయి తిరుపతి జిల్లా ఉదయరాజుపాలెం గ్రామానికి చెందిన శివకుమార్ మునియప్పన్ అనే వ్యక్తి బంగారు అంగళ్ల బజారులో తిరుగుతూ ప్రతి ఇంటిలోకి వెళ్లి ఎవరైనా కనబడితే వారికి తన వద్ద గల ఒక చీటిని చూపించి అందులో ఒక డాక్టర్ ద్వారా సర్టిఫైడ్ చేయబడి ఉండి ఈ చీటి ఇచ్చిన వ్యక్తికి మూగ, చెవుడు అని అతనికి ఎవరూ లేరని సహాయం చేయాలని చూపించేవాడు. వారు ఎంతో కొంత సాయం చేసేవారు. అలా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిలోని విలువైన వస్తువులను బంగారు, వెండి వస్తువులు, మొబైల్ ఫోన్లు దొంగలించేవాడు. ఈ క్రమంలోనే శంకరయ్య గారి వీధిలో కాపురం ఉండే గంగనపల్లి శివాజీ రావు అనే వ్యక్తి ఇంట్లోకి వెళ్లి చూడగా అతని భార్య హాల్లో అస్వస్తతతో పడుకొని ఉండగా నేరుగా పూజా మందిరంలోకి వెళ్లి విలువైన బంగారు, వెండి వస్తువులను చోరీ చేసి పరారయ్యాడు. బాదితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ద్వారా ముద్దాయి ఆచూకీ కనుగొని సోమవారం మధ్యాహ్నం అరెస్టు చేసి దొంగిలించిన చోరీ సొత్తు 92 గ్రాముల బంగారు నగలు, 22 గ్రాములు వెండి ఉంగరాలు, ఒక ల్యాప్‌టాప్, సాంసంగ్ ట్యాబ్, ఒక ఐఫోన్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వాటి విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసులో నిందితుడిని గుర్తించి అరెస్టు చేసిన పోలీసులను ఏఎస్పీ అభినందించారు.



## కటాఫ్ తేదిని పెంచాలి

:నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవిశంకర్

**బద్వేలు, జూన్ 8 (ప్రభాతవార్త) :**



రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ వ్యవస్థ నిరుపేద విద్యార్థుల పాలిటవరంగా ఉందని అయితే ఈ విద్యాసంవత్సరంలో 31వ తేది వరకు జరిగిన అడ్మిషన్లనే ప్రతిపాదికంగా తీసుకుని మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్న దృష్ట్యా జూన్ 30వ తేది వరకు పెంచాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మానుగుంట రవిశంకర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అత్యద్భుత ఫలితాలు మరియు ప్రభుత్వం ఈ సంవత్సరం చేపట్టిన బడి పండుగ తదితర కార్యక్రమాల ద్వారావిద్యార్థుల నమోదు, ఉపాధ్యాయుల పని సర్దుబాటు కటాఫ్ తేదిని మే 31వ తేది నుంచి కనీసం జూన్ 11వ తేదికి మార్చే ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. మోడల్ ప్రైమరీ పాఠశాలల వలన విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని ఈ వ్యవస్థకు కనీసం 3 సంవత్సరాలు సమయం ఇచ్చి ఫలితాలను తర్వాత అంచనావేయడం ద్వారా రేషనలైజేషన్ ప్రక్రియ చేపడితే బాగుంటుందని ఆయన ఈ సందర్భంగా రవిశంకర్ తెలిపారు.

## విద్యుత్కు అంతరాయం

**తొండూరు జూన్ 8 ప్రభాతవార్త:**
మండలంలోని పలు గ్రామాలలో 09.06.2026వ తేదీ, మంగళ వారం ఉదయం 09.00 గంటల నుండి మధ్యాహ్నం 12:30గంటల వరకు 11కెవి అగుడూరు టౌన్ ఫీడర్ ట్రీ కటింగ్ కారణంగా 33/11కేవీ అగుడూరు సబ్ స్టేషన్, పరిధిలోని అగుడూరు, ఇనగలూరు, పాలురు యాదవవారిపల్లె గ్రామలలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది . అలాగే ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 16:00గంటల వరకు 11కెవి మల్లెల టౌన్ ఫీడర్ లైన్ వ ర్క్ కారణంగా 33/11కేవీ మల్లెల సబ్ స్టేషన్, పరిధిలోని మల్లెల గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది దయచేసి ప్రజలు మరియు రైతులందరూ సహకరించవలసినదిగా కోరుతున్నాను.

